ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర
సంపుటి : 13
సంచిక : 234
పేజీలు : 5 వెల రూ. 2/-
ఆదివారం
14 సెప్టెంబర్ 2025
PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com

## యూరియా పాట్లు.. అన్నదాతల అగచాట్లు

- మహబూబాబాద్ జిల్లాలో రైతు ఆత్మహత్యాయత్నం
- కామారెడ్డి జిల్లాలో మూర్ఛతో పడిపోయిన రైతు



2 లో

## భారత్‌కు ఎదురుందా?

- నేడు పాకిస్థాన్‌తో పోరు
- ఆసియాకప్ టోర్నీ
బాయ్‌కాట్‌పై సోషల్‌మీడియాలో ట్రెండింగ్




2 లో

# అల్లరి చేయొద్దు.. మీకే నష్టం!


- వృత్తివిద్యా కాలేజీల ప్రతినిధులకు భట్టి వార్నింగ్
- కాలేజీలతో సర్కారు జరిపిన చర్చలు విఫలం
- ఇరవై నెలలుగా ఇదే మాట చెప్తున్నారంటూ
- ఎఫ్ఏటీహెచ్ఈఐ ప్రతినిధుల అసంతృప్తి
- సోమవారం నుంచి కాలేజీల బంద్‌కు నిర్ణయం
- సెమిస్టర్ పరీక్షల బహిష్కరణ, ఆందోళన బాట

2 లో



## గృహ నిర్మాణం ప్రాథమిక హక్కు..

- రియల్ ప్రాజెక్టుల పునరుద్ధరణకు నిధిని ఏర్పాటు చేయాలి
- సుప్రీం కోర్టు ఆదేశం



2 లో

## కృష్ణా జలాల్లో రాష్ట్ర వాటా సాధిస్తాం

- ట్రైబ్యునల్ ఎదుట బలమైన వాదనలు వినిపించాలి
- 904 టీఎంసీలు కేటాయించేలా పట్టుబట్టాలి
- నీటిపారుదల శాఖ నిపుణులు, న్యాయవాదులతో సీఎం రేవంత్‌రెడ్డి
- నీటి వాటాల సాధనలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపణ



2 లో

# ఉప ఎన్నికలకు వచ్చే దమ్ముందా?..

- ఆ పది మందితో రాజీనామా చేయించు..
సీఎం రేవంత్‌కు కేటీఆర్ సూటి సవాల్
- ప్రజాస్వామ్యంలో రాజకీయ ద్రోహులకు చోటులేదు
- ప్రజల ఆకాంక్షలను తుంగలో తొక్కి స్వార్థంతో ఆస్తులు పెంచుకొనేందుకే వాళ్లు పార్టీ మారిండ్రు
- ఆ పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు తథ్యం
- ఫిరాయింపు ఎమ్మెల్యేలకు ప్రజాకోర్టులో శిక్ష తప్పదు
- ఎవరి అభివృద్ధి కోసం బండ్ల కాంగ్రెస్‌లోకి పోయిండు?
- కాంగ్రెస్‌లో చేరను.. చేరాల్సి వస్తే రైలు కింద తల పెడతా అని చెప్పినోడు బీఆర్ఎస్ సభకు ఎందుకు రాలే?
- యూరియా నుంచి గ్రూప్-1 పోస్టుల దాకా తెగనమ్ముకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు
- ధ్వజమెత్తిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బీఆర్ఎస్‌లో భారీగా చేరిన గద్వాల కాంగ్రెస్ నేతలు

2 లో



# అల్లరి చేయొద్దు.. మీకే నష్టం!..

**హైదరాబాద్, సెప్టెంబర్ 13 :**
'అకస్మాత్తుగా బంద్‌కు పిలుపునిస్తే ఎట్లా? తొందరపడొద్దు.. అల్లరి చేసి ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టొద్దు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగాలేదు. మీకు ఇవ్వాల్సిన బకాయిలను.. కాస్త ఆలస్యంగా ఇద్దామనుకున్నాం. మీరిలా చేస్తే ఎట్లా? అల్లరి చేస్తే మీకే నష్టం'.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యలివి! 20 నెలలుగా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం నుంచి బంద్‌కు వెళ్తామని అల్టిమేటం జారీ చేసిన తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల సంఘాల సమాఖ్య ప్రతినిధులను శనివారం చర్చలకు పిలిచి.. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క చేసిన వ్యాఖ్యలు. చర్చలకు పిలిచి, రుసరుసలాడటం, హెచ్చరించడం సరికాదని కాలేజీల యాజమాన్యాల ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. 'బకాయిలు విడుదల చేయాలని వినతిపత్రాలిచ్చాం.
ఆ తర్వాత ప్రభుత్వానికి ఆర్థికభారంలేని ప్రత్యామ్నాయ ప్రణాళికను సమర్పించాం. మంత్రులు, అధికారులను ఎన్నిసార్లు కలిసినా ప్రయోజనం లేనందువల్లే బంద్‌కు పిలుపునివ్వాల్సి వచ్చింది' అని తేల్చిచెప్పినట్టు సమాచారం. 'తొందరపడొద్దు.. బకాయిలు విడుదలచేస్తాం' అని డిప్యూటీ సీఎం చెప్పగా.. 'ఎప్పటిలోగా ఇస్తారో చెప్పండి. దసరాలోపు బకాయిలు చెల్లిస్తామని హామీ ఇస్తేనే బంద్ పిలుపును విరమిస్తాం'అని కాలేజీల యాజమాన్యాల ప్రతినిధులు స్పష్టంచేశారు. దీంతో 'నేను ఢిల్లీ వెళ్తున్నాను, వచ్చిన తర్వాత మాట్లాడుతాను' అని భట్టివిక్రమార్క తెలపగా.. 'సోమవారం వరకు ఎన్ని బకాయిలు విడుదల చేస్తారో స్పష్టంగా చెప్పండి, అలా అయితేనే బంద్ పిలుపును విరమిస్తాం. కోర్టుకు వెళ్లిన కాలేజీలకు బకాయిలు విడుదల చేశారు. మేమేం పాపం చేశాం?' అని కాలేజీల ప్రతినిధులు ముక్తకంఠంతో మంత్రికి తేల్చిచెప్పారు. అయినా కూడా భట్టివిక్రమార్క ఎలాంటి హామీ ఇవ్వకుండానే సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో పిలుపునిచ్చిన మేరకు సోమవారం నుంచి కాలేజీలు మూసివేసి, ఆందోళనబాట పట్టాలని నిర్ణయించారు.
సెమిస్టర్ పరీక్షలూ బహిష్కరణ.. నిరవధిక బంద్ పాటించాలని నిర్ణయం తీసుకున్న కాలేజీ యాజమాన్యాలు సోమవారం నుంచి జరగాల్సిన సెమిస్టర్ పరీక్షలను కూడా బహిష్కరించాలని, పరీక్షల నిర్వహణకు సహకరించవద్దని తీర్మానించాయి. సోమవారం నుంచి బీఈడీ ఒకటో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు జరగాల్సి ఉంది. యాజమాన్యాలు కాలేజీల బంద్‌కు పిలుపునివ్వడంతో మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఈ పరీక్షలను వాయిదావేసింది. తిరిగి ఈ నెల 26 నుంచి పరీక్షలను నిర్వహిస్తామని ప్రకటించింది. జేఎన్టీయూ పరిధిలో బీ-ఫార్మసీ సెమిస్టర్ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. కాలేజీల యాజమాన్యాలు మూకుమ్మడిగా బంద్ ప్రకటించడంతో ఈ పరీక్షలు కూడా సందిగ్ధంలో పడ్డాయి.
సోమవారం కీలక సమావేశం.. సర్కారుతో చర్చలు విఫలం కావడం, స్పష్టమైన హామీ రాకపోవడంతో కాలేజీల యాజమాన్యాలు బంద్ విషయంలో ముందుకెళ్లాలని నిర్ణయించాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదలయ్యే వరకు విశ్రమించొద్దన్న నిర్ణయానికి వచ్చాయి. ఈ మే రకు ఎఫ్ఏటీహెచ్ఈఐ ప్రతినిధులు సోమవా రం ఉదయం అత్యవసరంగా సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి అన్ని కాలేజీల యాజమాన్యాలను ఆహ్వానించారు. సోమవారం ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోతే కాలేజీల బంద్ కొనసాగించడంతోపాటు, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు.
ఫలించని రెండో విడత చర్చలు..
వృత్తివిద్యా కాలేజీల యాజ మాన్యాలతో భట్టివిక్రమార్క జరిపిన చర్చలు విఫలమ య్యాయి. ఎలాంటి హామీ ఇవ్వకుండానే డిప్యూటీ సీఎం సమావేశం నుంచి వెళ్లిపోయారు. అనంతరం ఎఫ్ఏటీహెచ్ఈఐ ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి రెండో విడత చర్చలు జరిపారు. బంద్ పాటించవద్దని, బకాయిలు చెల్లిస్తామని ఇరువురు చెప్పినట్టు తెలిసింది.
బంద్ పిలుపుతో ఉలిక్కిపడ్డ సర్కారు!..
ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలపై 20 నెలలుగా జాప్యం చేస్తున్న ప్రభుత్వంలో.. బంద్ పిలుపుతో కదలిక వచ్చిందని భావించామని ఎఫ్ఏటీహెచ్ఈఐ తెలిపారు. 1500లపైగా కాలేజీలను సోమవారం నుంచి మూసివేస్తామని ప్రకటించడంతో ప్రభుత్వ పెద్దల నుంచి ఏదైనా హామీ లభిస్తుందని ఆశించామని చెప్తున్నారు. కానీ చర్చలు కూడా నిరుత్సాహం మిగిల్చాయని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చేతులెత్తేసిన నేపథ్యంలో ఇంజినీరింగ్, న ర్సింగ్, ఫార్మసీ, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ, లా కాలేజీలను మూసివేస్తామని, తరగతు లు నిర్వహించబోమని హెచ్చరించారు. ఆందోళనబాట తప్పడంలేదని కాలేజీ యాజమాన్యాల ప్రతినిధులు చెప్పారు.

# యూరియా పాట్లు.. అన్నదాతల అగచాట్లు

**ఏఎం న్యూస్ / హైదరాబాద్ :**
బీబీపేట, దోమకొండ, చెన్నూరు గ్రామీణం, చేగుంట, కొత్తగూడ, కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో యూరియా పాట్లు కొనసాగుతున్నాయి. పలుచోట్ల అన్నదాతలకు అగచాట్లు తప్పట్లేదు. కామారెడ్డి జిల్లా బీబీపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) వద్ద సుమారు వెయ్యిమంది రైతులు యూరియా కోసం శుక్రవారం అర్ధరాత్రి నుంచి వరుసలో ఉన్నారు. పీఏసీఎస్ గోదాంకు 640 బస్తాలు వచ్చాయని తెలుసుకొని శనివారం ఉదయం వరకు క్యూలోనే వేచి ఉన్నారు. యూరియా బస్తాల టోకెన్ల పంపిణీ ప్రారంభమయ్యే సమయానికి ఇక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొని పోలీసులకు రైతులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో పోలీసు అధికారులు అదనపు బలగాలను రప్పించి స్టేషన్ ఆవరణలో రైతులకు టోకెన్లు ఇచ్చారు. ఇదే మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన రైతు అంబల్ల చిన్న రేకయ్య శనివారం పోలీస్‌స్టేషన్ వద్ద మూర్ఛ వచ్చి పడిపోయారు. ఆయనను వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.
మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం అస్నాద్‌కు 222 యూరియా బస్తాలు రావడంతో రైతువేదిక వద్ద శనివారం పంపిణీ ప్రారంభమైంది. కాసేపటికే ఉద్రిక్తత నెలకొనడంతో అధికారులు పంపిణీ నిలిపివేశారు.
మెదక్ జిల్లా చేగుంటకు యూరియా వస్తుందని తెలుసుకున్న వందల మంది రైతులు శుక్రవారం రాత్రి నుంచే రైతువేదిక వద్ద నిరీక్షించారు. రద్దీ ఎక్కువ ఉండటంతో పోలీసుల ఆధ్వర్యంలో టోకెన్లు పంపిణీ చేశారు. ఇదే మండలం మక్కరాజుపేటలో తోపులాట చోటుచేసుకుంది. రైతు ఆత్మహత్యాయత్నం.. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ బూర్కవానిగుంపు కాలనీకి చెందిన రైతు మల్లెల నర్సయ్య రెండో విడత యూరియా నిమిత్తం పొగుళ్లపల్లి పీఏసీఎస్‌కు, కొత్తగూడలోని యూరియా పంపిణీ కేంద్రానికి వారం రోజులుగా తిరుగుతున్నా లభించకపోవడంతో మనస్తాపంతో పురుగుమందు తాగారు. గుర్తించిన కుటుంబ సభ్యులు నర్సంపేటలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. ఈ విషయమై ఏవో ఉదయ్ మాట్లాడుతూ..నర్సయ్యకు యూరియా ఇచ్చిన విషయంపై రికార్డులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. చేగుంట రైతువేదిక వద్ద బారులు.. దాచుకున్న యూరియా దొంగలపాలు కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ మండలం బోడపెల్లి గ్రామానికి చెందిన అయిలవేణి రాజక్క జగన్నాథ్‌పూర్ శివారులోని తన పత్తి చేనులో 14 బస్తాల యూరియాను నిల్వ చేసుకోగా శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వాహనాల్లో వచ్చి తస్కరించారు. ఈ మేరకు ఆమె శనివారం ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# ఉప ఎన్నికలకు వచ్చే దమ్ముందా?..

నడిగడ్డ మీద గులాబీ దళం గర్జించింది. తేరు మైదానం జన సందోహంతో శిగమూగింది. పట్టణ శివారునుంచి సభాస్థలి దాకా సాగిన ర్యాలీ జైత్రయాత్రను తలపించింది. సభలో ఉద్వేగభరితంగా సాగిన కేటీఆర్ ప్రసంగం పిడుగుల వర్షం కురిపిస్తే .. సభలో జనం చప్పట్ల జడివానలో తడిసిముద్దయ్యారు. ప్రధానంగా గద్వాల అభివృద్ధికి తాము ఏం చేశామో వివరిస్తూ.. మరోవైపు కాంగ్రెస్ పాలనలో ఏ వర్గం ఎలా మోసపోయిందో విడమర్చి చెప్పిన తీరు జనంలో ఊపు తెచ్చింది. ప్రశ్నలు వేసి ప్రజల నుంచి జవాబులు రాబట్టిన తీరు.. జోష్‌ను తారస్థాయికి తీసుకువెళ్లింది. గంటన్నర పాటు ఉర్రూతలూగించిన ప్రసంగానికి క్లయిమాక్స్‌గా 'దమ్ముంటే ఉప ఎన్నికలకు రావాలి' అని చేసిన సవాల్‌తో గద్వాల దద్దరిల్లింది.

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 13 :**
'సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన భాషలో చెప్తేనే అర్థమయితది. అయినా అట్లాంటి భాష మనం మాట్లాడలేం. కానీ, తప్పదు.. ఆయన కోసం మాట్లాడాలి. రేవంత్ నువ్వు మొగోడివైతే ఆ 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించు. ఉప ఎన్నికలకు పోదాం. బై ఎలక్షన్లలో చూసుకుందాం. పదేండ్ల కేసీఆర్ పాలన, రెండేండ్ల కాంగ్రెస్ పాలన.. ఏది బాగుందో తేల్చుకుందాం. ఉప ఎన్నికల్లో దమ్ముంటే గెలిచి చూపించు' అంటూ గద్వాల తేరు మైదానం నుంచి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు.
శనివారం గద్వాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన గద్వాల గర్జన సభలో ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలు, అభిప్రాయాలను తుంగలో తొక్కి వ్యక్తిగత అవసరాల కోసం పార్టీలు మార్చిన ఎమ్మెల్యేలకు ప్రజాకోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించారు. పార్టీలు మారిన ఆ పది మంది ఎమ్మెల్యేల పరిస్థితి దయనీయంగా ఉన్నదని, అసలు వారు ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని దుస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు.
స్వార్థం కోసం, ఆస్తులు పెంచుకునేందుకు అవకాశవాదంతో వారు పార్టీలు మారారని మండిపడ్డారు. పార్టీ ఫిరాయింపుల అంశాన్ని సుప్రీంకోర్టు కూడా సీరియస్‌గా తీసుకున్నదని చెప్పారు. ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు తప్పవని, వారికి ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు. రాబోయే ఉప ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి రెఫరెండమని అన్నారు.
సిట్టింగ్ ఎమ్మెల్యే బండ్లపై ఫైర్.. కాంగ్రెస్‌లోకి వెళ్లిన తర్వాత కూడా ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నామని గద్వాల సిట్టింగ్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చెప్పుకోవడం సిగ్గుచేటని కేటీఆర్ ఎద్దేవా చేశారు. గద్వాల బీఆర్ఎస్ సభలో వేలాదిమంది ఉంటే, బీఆర్ఎస్‌లోనే ఉన్నానని చెప్పుకుంటున్న గద్వాల ఎమ్మెల్యే మాత్రం రేవంత్‌రెడ్డితో ఉన్నారని పేర్కొన్నారు. ఎవరి అభివృద్ధి కోసం కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వెళ్లాడని ప్రశ్నించారు. పేదల కోసమైతే ఆడబిడ్డలకు నెలకు రెండున్నర వేలు ఇస్తామన్న కాంగ్రెస్ హామీ ఏమైందని, రెండు లక్షల రుణమాఫీ ఎక్కడ మాయమైందని నిలదీశారు. ఆడబిడ్డలకు స్కూటీ ఎక్కడ ఇచ్చారని, 20 లక్షల దళితబంధు ఎక్కడని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ హామీ ఏమైందని నిలదీశారు.
అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ పరిపాలన చూసి పార్టీ మారిండా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ నేతలు యూరియాను బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని, గ్రూప్-1 ఉద్యోగాలను కూడా అమ్ముకున్నారని ఆరోపించారు. ప్రజలు నమ్మి ఓటేసి, ఇప్పుడు మోసపోతున్నారని, ఇందుకే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిండా? అని ప్రశ్నించారు. గద్వాల ఎమ్మెల్యే గతంలో చెప్పిన మాటలపై కూడా కేటీఆర్ విరుచుకుపడ్డారు. 'కాంగ్రెస్‌లో చేరబోనని, చేరాల్సి వస్తే రైలుకింద తలపెడతానని చెప్పిన ఎమ్మెల్యే ఈ సభకు ఎందుకు రాలేదు? బీఆర్ఎస్‌లో ఉన్నానని చెప్పుకుంటూ కాంగ్రెస్‌కు లొంగిపోవడం ప్రజలను మోసం చేయడమే' అని ఆయన ధ్వజమెత్తారు.
బంగారు పళ్లెంలో పెట్టి ఇచ్చిన తెలంగాణను కాంగ్రెస్ పాడు చేసింది. అసమర్థ కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్ల నుంచి నిరుద్యోగుల వరకు అన్ని వర్గాలు బాధ పడుతున్నాయి. విద్య నుంచి సంక్షేమం వరకు అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సంపూర్ణంగా విఫలమైంది.
కాంగ్రెస్ వైఫల్యాలపై కేటీఆర్ ధ్వజం.. 'రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో ఏం జరిగిందో అందరికీ తెలుసు. మళ్లీ యూరియా కష్టాలు, కరెంటు కోతలు మొదలయ్యాయి. కరోనా సమయంలో కూడా రైతుబంధు వేసిన ఘనత కేసీఆర్‌ది. అన్ని పథకాలను కష్టకాలంలో కూడా అమలు చేసిన ఘనత ఆయనదే. బంగారు పళ్లెంలో పెట్టి ఇచ్చిన తెలంగాణను కాంగ్రెస్ పాడు చేసింది. అసమర్థ కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్ల నుంచి నిరుద్యోగుల వరకు అన్ని వర్గాలు బాధ పడుతున్నాయి. విద్య నుంచి సంక్షేమం వరకు అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సంపూర్ణంగా విఫలమైంది' అని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో గురుకులాల పరిస్థితి అప్పుడెలా ఉందో? ఇప్పుడెలా ఉందో అందరికీ తెలిసిందేనని అన్నారు. కాంగ్రెస్ మోసం తప్ప మరేం చేయలేదని మండిపడ్డారు. మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. గద్వాల మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగరేయాలని పిలుపునిచ్చారు.
కేసీఆర్ పాలనలో గద్వాల అభివృద్ధి.. 'తెలంగాణ ఉద్యమంలో గద్వాల ముందు వరుసలో నిలిచింది. జోగులాంబ తల్లి ఆశీస్సులతో గద్వాల జిల్లాగా మారింది. గద్వాలను జిల్లా కేంద్రంగా మార్చడమే కాకుండా మెడికల్ కాలేజీ కూడా తెచ్చాం. తుమ్మిళ్ల ప్రాజెక్టును పూర్తి చేసి, ఉమ్మడి పాలమూరు జిల్లాలో 18.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాం. 22 నెలలైనా ఇప్పటి దాకా నిర్మాణ పనులను కొనసాగించకుండా గట్టు ప్రాజెక్టును పండబెట్టింది కాంగ్రెస్ అని గుర్తుంచుకోండి' అని కేటీఆర్ విమర్శించారు. గద్వాల బహిరంగ సభ సందర్భంగా భారీ సంఖ్యలో కాంగ్రెస్ నేతలు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌లో చేరారు. కేటీఆర్ వారికి గులాబీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. వర్షంలోనూ భారీగా తరలివచ్చిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ వచ్చే ఎన్నికల్లో గద్వాలలో ఎమ్మెల్యేను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.
కృష్ణమోహన్‌రెడ్డికి కౌంటర్.. తాను గద్వాలకు వస్తుంటే ఒక కాంగ్రెస్ నాయకుడు ఏ ముఖం పెట్టుకుని వస్తున్నావని అడుగుతున్నాడని, మనకి ముఖం లేదా ఇక్కడికి రావడానికి అని ప్రశ్నించారు. గద్వాలను జిల్లా చేసి, మెడికల్ కాలేజీ ఇచ్చి, రెండు ఎత్తిపోతలతో లక్ష ఎకరాలకు నీళ్లు ఇచ్చి, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి 8 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తే ఇవాళ మరో 10 లక్షలు కలిపి మరో 18 లక్షల ఎకరాలు ఉమ్మడి జిల్లాలో సాగువుతున్నదని, ఇది కేసీఆర్ నాయకత్వంలో కాదా? అని ప్రశ్నించారు. ఇవాళ డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగాన్ని రూ. 3 కోట్లకు అమ్ముకున్నట్టు వార్తలు వస్తున్నాయని, 563 ఉద్యోగాలు అమ్ముకుని రూ. 1700 కోట్లు దండుకున్నట్టు నిరుద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు.
కాంగ్రెస్‌లో చేరబోనని, చేరాల్సి వస్తే రైలుకింద తలపెడతానని చెప్పిన ఎమ్మెల్యే ఈ సభకు ఎందుకు రాలేదు? బీఆర్ఎస్‌లో ఉన్నానని చెప్పుకుంటూ కాంగ్రెస్‌కు లొంగిపోవడం ప్రజలను మోసం చేయడమే.
కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి.. గద్వాల జిల్లా కేంద్రంలో కేటీఆర్ పర్యటన సందర్భంగా కాంగ్రెస్ నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కేటీఆర్ సమక్షంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌తోపాటు మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యూసుఫ్, మాజీ జెడ్పీటీసీ పద్మా వెంకటేశ్వరరెడ్డి, మాజీ కౌన్సిలర్లు జయలక్ష్మి, అరుణ, లక్ష్మి, రంజిత్, జయమ్మ, మహేశ్, జమన్‌సింగ్, రామచంద్రుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అమరవాయి కృష్ణారెడ్డి, ప్రతాప్, మాజీ ఉపసర్పంచులు వెంకటేశ్, గోకారి, గోవిందు, ఆశన్న తదితరులు చేరారు.
ఇథనాల్ ఫ్యాక్టరీ లైసెన్స్ రద్దు చేయాలి.. ఇథనాల్ ఫ్యాక్టరీ లైసెన్స్ రద్దు చేయాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలంపూర్‌లోని రాజోలి మండలం పెద్దగానివాడలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం రైతులను తీసుకుపోయి 15 రోజులు జైల్లో పెట్టి, నాన్ బెయిలబుల్ కేసులు పెట్టించారని కేటీఆర్ తెలిపారు. వాళ్లకు అండగా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు మహబూబ్‌నగర్ జైలుకు, కోర్టుకు వెళ్లి రైతులను విడిపించి తీసుకువచ్చారని తెలిపారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఇట్లాగే ప్రజలు ఆందోళన చేస్తే అక్కడ పర్మిషన్లు రద్దు చేశారని గుర్తుచేశారు. ఈ ప్రభుత్వానికి నడిగడ్డ మీద ఏమాత్రం ప్రేమ ఉన్నా వెంటనే ఆ ఫ్యాక్టరీ లైసెన్సు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతన్నలకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.
వర్షంలో సైతం సడలని అభిమానం.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్ఎస్‌పై జనం అభిమానం ఉందనడానికి గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన గద్వాల గర్జన సజీవ సాక్ష్యంగా నిలిచింది.. ఒకవైపు వర్షం పడుతున్నా కేటీఆర్ రాక కోసం జనం ఎదురు చూశారు. అంతకుముందు ఎర్రవల్లి చౌరస్తా నుంచి గద్వాల వరకు గులాబీ జెండాలతో పట్టణం జనసంద్రంగా మారింది. భారీ కాన్వాయ్‌తో కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సభలో వర్షంలో సైతం 'జై కేసీఆర్', 'జై కేటీఆర్' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామిరెడ్డి, నవీన్‌కుమార్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి అంజయ్యయాదవ్, జైపాల్‌యాదవ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు ఇంతియాజ్, ఆంజనేయగౌడ్, రజిని, నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతునాయుడు, శ్యామల, విజయ్‌కుమార్, పల్లయ్యలు పాల్గొన్నారు.
కాంగ్రెస్‌లోకి వెళ్లిన తర్వాత కూడా ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నానని గద్వాల సిట్టింగ్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చెప్పుకోవడం సిగ్గుచేటు. గద్వాల బీఆర్ఎస్ సభలో వేలాదిమంది ఉంటే, బీఆర్ఎస్‌లోనే ఉన్నానని చెప్పుకుంటున్న గద్వాల ఎమ్మెల్యే మాత్రం రేవంత్‌రెడ్డితో ఉన్నారు.
కేసీఆర్ పాలనకు జనం జేజేలు..
కాంగ్రెస్ రెండేండ్ల పాలనపై కేటీఆర్ అడిగిన పలు ప్రశ్నలకు ప్రజలు పెద్ద ఎత్తున స్పందించారు. ఆయన అడిగిన ప్రతి ప్రశ్నకు ముక్తకంఠంతో బదులిచ్చారు.
గద్వాలను జిల్లా కేంద్రం చేయడమే కాకుండా మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ తెచ్చింది ఎవరు? అన్న కేటీఆర్ ప్రశ్నకు కేసీఆర్ అని ముక్తకంఠంతో చెప్పారు.
గద్వాల నర్సింగ్ కాలేజీ పక్కనే 1275 డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చిందెవరు? అవి పూర్తయ్యాయా? అన్న ప్రశ్నలకు జనం నుంచి కేసీఆర్ అని చెప్పారు.
గద్వాల తాలూకాకు సాగునీరు సమృద్ధిగా అందాలని మొత్తం జిల్లాలో అటు గట్టు తమ్మిళ్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది ఎవరు అని కేసీఆర్ అడిగితే కేసీఆర్ అని సమాధానం చెప్పారు. మొదలు పెట్టింది ఎవరు అన్న ప్రశ్నకు జనం మళ్లీ కేసీఆర్ అని అన్నారు. బీఆర్ఎస్ దిగిపోయేనాటికి గట్టు దాదాపు 45 శాతం పూర్తయిందని, ఆ పథకాన్ని పూర్తిచేయకుండా పండబెట్టింది ఎవరని అడిగితే కాంగ్రెస్, కాంగ్రెస్ అని ప్రజలు గట్టిగా బదులిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధు ఎంతిస్తామన్నారన్న ప్రశ్నకు.. రూ. 15 వేలు అని జనం బదులిచ్చారు. మరి వస్తున్నాయా? అని ప్రశ్నిస్తే లేదు అని చెప్పారు. కేసీఆర్ రూ. 2 వేల పింఛన్ ఇస్తున్నడు.. నేనొస్తే రూ. 4 వేలు ఇస్తా అన్నాడు.. మరి ఇస్తున్నాడా? అని ప్రశ్నిస్తే లేదనే సమాధానం వచ్చింది. వీటితోపాటు కల్యాణలక్ష్మి, దళితబంధు, అభయహస్తం, ఆడబిడ్డలకు రూ. 2,500, రుణమాఫీ వంటి విషయాలపై అడిగిన ప్రశ్నలకు ప్రజలు.. లేదు.. అని ముక్తకంఠంతో బదులిచ్చారు. మరో ఆరు నుంచి 9 నెలల్లో ఇదే గద్వాల జిల్లాలో ఉప ఎన్నిలకు రాబోతున్నాయని, పార్టీ మారిన ఎమ్మెల్యేకు బుద్ధి చెప్దామా? అంటే చెబుదాం.. చెబుదాం అని గట్టిగా అన్నారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలా? వద్దా? అంటే కావాలి.. కావాలి అని గట్టిగా బదులిచ్చారు.

# భారత్‌కు ఎదురుందా?

**ఏఎం న్యూస్ / హైదరాబాద్ :**
ఆసియాకప్‌లో కీలక పోరుకు రంగం సిద్ధమైంది. చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్..దుబాయ్‌లో ముఖాముఖి తలపడబోతున్నాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత దాయాది దేశాలు తొలిసారి తలపడబోతున్న మ్యాచ్‌పై అభిమానుల్లో ఆసక్తి నెలకొన్నది. ఓవైపు బాయ్‌కాట్ అంటూ సోషల్‌మీడియాలో పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న నిరసన భారత్, పాక్ పోరుకు మరింత హీట్ పుట్టిస్తున్నది. అన్ని విభాగాల్లో పాక్ కంటే ఆధిపత్యంలో కనిపిస్తున్న సూర్యకుమార్ నేతృత్వంలోని టీమ్‌ఇండియా మంచి జోష్‌మీద ఉంది. అన్నింటా అగ్రగామిగా కనిపిస్తున్న భారత్‌కు పాక్ దీటైన పోటీనిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.
దుబాయ్:
క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. భారత్, పాకిస్థాన్ జట్లు ఆసియాకప్‌లో ఆదివారం అమీతుమీ తేల్చుకోబోతున్నాయి. గ్రూపు-ఏ లీగ్ పోరులో భాగంగా చిరకాల ప్రత్యర్థులు సై అంటే సై అంటున్నాయి. ఇప్పటికే ఎనిమిది సార్లు ఆసియాకప్‌ను దక్కించుకున్న టీమ్‌ఇండియా రికార్డు స్థాయిలో తొమ్మిదో సారి కన్నేస్తే.. కనీసం పోటీ ఇచ్చేందుకు పాక్ పట్టుదలతో ఉంది. ఓవైపు దిగ్గజ ద్వయం రోహిత్‌శర్మ, విరాట్‌కోహ్లీ రిటైర్మెంట్ తర్వాత తొలిసారి భారత్ బరిలోకి దిగుతుండగా, మరోవైపు బాబర్ ఆజమ్, రిజ్వాన్ లేకుండా పాక్ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నది. రోకో వారసత్వాన్ని పుణికి పుచ్చుకునేందుకు యంగ్ ఇండియా అడుగులు వేస్తున్నది. శుభ్‌మన్ గిల్, అభిషేక్‌శర్మ రూపంలో టీమ్‌ఇండియా అదిరిపోయే ఓపెనింగ్ జోడీ దొరకగా, తిలక్‌వర్మ, శాంసన్, సూర్యకుమార్, హార్దిక్, శివమ్ దూబే, బుమ్రా, కుల్దీప్ లాంటి క్రికెటర్లతో భారత్ పటిష్టంగా కనిపిస్తున్నది.
ఆసియాకప్‌ను మరోమారు తమ ఖాతాలో వేసుకోవాలన్న ఏకైక లక్ష్యంతో అరబ్ గడ్డపై అడుగుపెట్టిన టీమ్‌ఇండియా మెండైన ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్నది. తొలి మ్యాచ్‌లో యూఏఈని 60 పరుగుల లోపే కట్టడి చేసిన టీమ్‌ఇండియా బ్యాటింగ్‌లో ఐదు ఓవర్లలోపే మ్యాచ్‌ను ముగించి తమ ఉద్దేశమేంటో చెప్పకనే చెప్పింది. దూకుడైన బ్యాటింగ్‌కు పెట్టింది పేరైన టీమ్‌ఇండియాకు పాకిస్థాన్ దీటైన పోటీని ఇవ్వగలుతుందా అన్నది ఆలోచింపజేస్తున్నది. యూఏఈతో పోరులో ఓవైపు చైనామన్ స్పిన్నర్ కుల్దీప్‌యాదవ్ మాయాజాలం చేస్తే యార్కర్ కింగ్ బుమ్రా తనదైన శైలిలో వికెట్ల వేట కొనసాగించాడు. షాహిన్‌షా అఫ్రిదీ మినహాయిస్తే పెద్దగా చెప్పుకోదగ్గ బౌలర్ లేని పాక్..టీమ్‌ఇండియా ఏ మేరకు నిలువరిస్తుందనేది చూడాలి. ఇదిలా ఉంటే సల్మాన్ అలీ అగా కెప్టెన్సీలో ఇప్పుడిప్పుడే గాడిలో పడుతున్న పాక్‌కు సయిమ్ అయూబ్, హరిస్ కీలకంగా మారారు.
బాయ్‌కాట్ మ్యాచ్..
పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు చనిపోయిన తర్వాత ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ జరిపిన ఆపరేషన్ సిందూర్‌లో పాక్ ఎయిర్‌బేస్‌లు పూర్తిగా దెబ్బతిన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉగ్రదాడికి నిరసనగా పాక్‌తో భారత్ మ్యాచ్ ఆడవద్దంటూ ఓవైపు సోషల్‌మీడియాలో బాయ్‌కాట్ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఉగ్రదాడిలో మరణించిన కుటుంబాలు పాక్‌తో ఆడవద్దంటూ తమ నిరసన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. అయితే ఐసీసీ మల్టీ నేషన్ ఈవెంట్ కావడంతో కేంద్ర ప్రభుత్వ అనుమతితో భారత్ పోటీకి దిగింది. దీనిపై దాదాపు అన్ని వైపుల నుంచి తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి.

# గృహ నిర్మాణం ప్రాథమిక హక్కు..

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13:**
గృహ నిర్మాణ హక్కును ప్రాథమిక హక్కుగా ప్రకటించిన సుప్రీం కోర్టు ఒత్తిడిలో ఉన్న రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల కోసం పునరుద్ధరణ నిధిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే ప్రాథమిక హక్కులో ఆశ్రయం పొందే హక్కు అంతర్భాగం. దీనివలన రాష్ట్రం తన పౌరులకు తగిన గృహాలను పొందేలా చూసుకోవాలి' అని సుప్రీం కోర్టు శుక్రవారం నొక్కి చెప్పింది. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు గృహ కొనుగోలుదారులను రక్షించడం, రియల్ ఎస్టేట్ రంగాన్ని ఊహాజనిత పద్ధతుల నుంచి ప్రక్షాళన లక్ష్యంగా అనేక ఆదేశాలను జారీ చేసింది. ఈ రంగంలో కొన్ని అవకతవకల కారణంగా అనేక ప్రాజెక్టులు నిలిచిపోయాయని, అనేక కుటుంబాలు చిక్కుకుపోయాయని పేర్కొంది.
గ్రేటర్ నోయిడాలోని ఒక హౌసింగ్ ప్రాజెక్టుకు సంబంధించి నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రైబ్యునల్ (ఎన్సీఎల్ఏటీ) ప్రకటించిన నిర్ణయాన్ని సవాల్ చేస్తూ పలువురు దాఖలు చేసిన అప్పీళ్లపై విచారించిన జస్టిస్ జేబీ పార్దివాలా, ఆర్ మహదేవన్ ధర్మాసనం.. ఇల్లు అన్నది కేవలం ఒకరి తలపై కప్పు కాదు.. అది ఆశలు, కలల ప్రతిబింబం అని వ్యాఖ్యానించింది. పన్ను చెల్లించే మధ్య తరగతి పౌరుడు ఇంటి కోసం తన జీవితాంతం పొదుపు చేసిన డబ్బును పెట్టుబడి పెట్టి రెట్టింపు భారాన్ని మోస్తున్నాడని తెలిపింది. ఒక వైపు ఈఎంఐ చెల్లిస్తున్నా కలల ఇల్లు అసంపూర్ణ భవనంగా మిగిలిపోతున్నదన్నారు. ఇల్లు లేకపోవడం వల్ల కలిగే ఆందోళన ఆరోగ్యం, ఉత్పాదకత, గౌరవంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని సుప్రీంకోర్టు విచారం వ్యక్తం చేసింది.
'గృహ నిర్మాణం విలాసవంతమైనది కాదు, ఊహాజనిత సాధనం కాదు. కానీ ఒక ప్రాథమిక అవసరం' అని పేర్కొన్న సుప్రీం బెంచ్ 12 విస్తృత ఆదేశాలను జారీ చేసింది. ఇందులో ఎన్సీఎల్‌టీ, ఎన్సీఎల్ఏటీ వంటి వాటిలో యుద్ధ ప్రాతిపదికన ఖాళీలను భర్తీ చేయడం, ట్రైబ్యునళ్లను బలోపేతం చేయడం, రియల్ ఎస్టేట్ దివాలా తీయడాన్ని పరిష్కరించడానికి అదనపు బెంచ్‌లను ఏర్పాటు చేయడం వంటివి ఉన్నాయి. మురికి నీటి ప్రవాహం వంటి ఘటనల కారణంగా ఢిల్లీలోని ఎన్సీఎల్‌టీ కోర్టు గదులను మూసివేసిన క్రమంలో ట్రైబ్యునళ్ల మౌలిక సదుపాయాల ఉన్నతీకరణపై మూడు నెలల్లోగా నివేదికలు దాఖలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించారు. తీర్పుకు సంబంధించిన కాపీని క్యాబినెట్ కార్యదర్శి, అన్ని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలకు పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

# కృష్ణా జలాల్లో రాష్ట్ర వాటా సాధిస్తాం

**ఏఎం న్యూస్ / హైదరాబాద్ :**
కృష్ణా నీటిని ఆంధ్రప్రదేశ్ అక్రమంగా తరలిస్తుండటంతో శ్రీశైలం, నాగార్జునసాగర్‌తోపాటు పులిచింతలలోని జలవిద్యుత్తు ప్రాజెక్టులు మూతపడే ప్రమాదం ముంచుకొచ్చింది. తెలంగాణ తరఫున సరైన వాదనలను వినిపించేందుకు ఇదే మంచి అవకాశం. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ జారవిడవొద్దు.
హైదరాబాద్: "కృష్ణాలో నికర, మిగులు, వరద జలాల్లో ఏవైనా సరే... తెలంగాణకు చెందాల్సిన వాటాలో చుక్క నీటిని కూడా వదులుకునేది లేదు. మన రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన 904 టీఎంసీల వాటాను సాధించి తీరుతాం. ఇందుకోసం ట్రైబ్యునల్‌లో సమర్థ వాదనలు వినిపించడానికి అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలి" అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అవసరమైన ఆధారాలన్నీ న్యాయనిపుణులకు అందించాలని ఇంజినీర్లు, అధికారులకు సూచించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిల్లీకి వెళ్లి ఈ విచారణలో పాల్గొంటారని, రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించేందుకు బలమైన వాదనలు వినిపించాలని న్యాయ నిపుణులకు సూచించారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో దిల్లీలో కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్ విచారణ జరగనుండగా తెలంగాణ తుది వాదనలు వినిపించనుంది. ఈ సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహంపై శనివారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సి.ఎస్.వైద్యనాథన్, కేంద్ర జలసంఘం మాజీ ఛైర్మన్ కె.వోహ్రా, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీ అంజద్ హుస్సేన్, సీఎంవో కార్యదర్శి మాణిక్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ...
"కృష్ణా జలాల్లో తెలంగాణకు ఇంతకాలం జరిగిన అన్యాయానికి అడ్డుకట్ట వేయాలి. రాష్ట్ర సాగు, తాగునీటి అవసరాలతోపాటు మెట్ట, కరవు ప్రాంతాలైన ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు కృష్ణా జలాలు తప్ప వేరే గత్యంతరం లేదనే విషయాన్ని ట్రైబ్యునల్ దృష్టికి బలంగా తీసుకెళ్లాలి.
నదీజలాల వాటాల పంపిణీ, సహజ న్యాయసూత్రాల ప్రకారం కొత్తగా ఏర్పడిన తెలంగాణకు కృష్ణాలో 904 టీఎంసీల నీళ్లు రావాల్సి ఉంది. అందుకనుగుణంగా వాదనలు సిద్ధం చేయాలి.
ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటివరకు కృష్ణాపై ఉన్న ప్రాజెక్టులు, నిర్మించతలపెట్టిన, అసంపూర్తిగా ఉన్న, నిర్లక్ష్యంగా వదిలేసిన ప్రాజెక్టుల వివరాలన్నీ ట్రైబ్యునల్ ముందుంచాలి.
పదేళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం కృష్ణా జలాల్లో రావాల్సిన న్యాయమైన వాటాలను సాధించకపోగా... ఏపీకి 512 టీఎంసీలను కట్టబెట్టి, 299 టీఎంసీల వాటాకు ఒప్పుకొని తెలంగాణకు తీరని అన్యాయం చేసింది.
పాలమూరు నుంచి డిండి వరకు ప్రాజెక్టులన్నింటినీ నాటి ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. ఈ నిర్లక్ష్య, ఉదాసీన వైఖరి కారణంగా ఏపీ కృష్ణా జలాలను అక్రమంగా తరలించుకుపోయిన విషయాన్ని ట్రైబ్యునల్‌కు వివరించాలి. ఉమ్మడి రాష్ట్రంలోనూ తెలంగాణ ప్రయోజనాలను పట్టించుకోలేదు.
శ్రీశైలం జలాశయం పూర్తిగా నిండకముందే... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు నుంచి రోజుకు 10 టీఎంసీల నీటిని ఇతర బేసిన్లకు తరలిస్తోంది. ఇందుకోసం కాలువల సామర్థ్యాన్ని పెంచుకుంటోంది. పట్టిసీమ తదితర ప్రాజెక్టుల నుంచి సైతం ఏపీ అక్రమంగా నీటిని తరలిస్తున్న తీరును ఆధారాలతో సహా ట్రైబ్యునల్‌కు నివేదించాలి" అని సీఎం న్యాయ నిపుణులకు సూచించారు.
బూర్గుల నిబద్ధత నేటితరానికి ఆదర్శం: సీఎం హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావుకు ప్రజల పట్ల ఉన్న నిబద్ధత నేటి తరానికి ఆదర్శం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బహుభాషావేత్తగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, రాజనీతిజ్ఞుడిగా ఆయన రాష్ట్రానికి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆదివారం బూర్గుల వర్ధంతి సందర్భంగా ఆయన చేసిన సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. వినోబాభావే ప్రారంభించిన భూదానోద్యమానికి బూర్గుల చట్టబద్ధత కల్పించి భూ సంస్కరణలకు నాంది పలికారన్నారు.

# బిజెపిని అధికారంలోకి తేవడానికి కలిసికట్టుగా పనిచేయాలి

## - కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
## - కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన బండ కార్తీక చంద్రారెడ్డి

ఏ ఎం న్యూస్ / హైదరాబాద్ :
బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా ఇటీవల నూతనంగా నియమితులైన మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి శనివారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీలో తనకు సముచితమైన ప్రాధాన్యత కల్పించినందుకు కిషన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గత కొంతకాలంగా అంకితభావంతో పార్టీకి తాను అందించిన సేవలను గుర్తించినందుకు పార్టీ జాతీయ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి కార్తిక రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బండ చంద్రారెడ్డి, మేకల సారంగపాణి, పోచయ్య యాదవ్, వీరన్న, సంపత్, రాజ్ కుమార్, రాజేష్ తదితరులు ఉన్నారు.



# అమ్మమ్మను గుర్తు చేసుకున కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి




ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :
విశ్వ ఆయుర్వేదిక్ పరిషత్ జాతీయ సెమినార్ కార్య క్రమం లో రెండవ రోజు(3 రోజుల కార్య క్రమం లో భాగం గా శని వారం జరిగిన,)జూబ్లిహిల్స్ నియోజక వర్గం యూసుఫ్ గూడా చెక్ పోస్ట్ లో ఉన్న నిమ్స్ మే ప్రాంగణం లో జరిగిన కార్య క్రమానికి కేంద్ర మంత్రి జి .కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఆయన మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలు కిందట వైద్య సేవలు అందుబాటులో అంతగా లేవు ఆయుర్వేదం ద్వారా ప్రజలందరు చికిత్స తీసుకున్నారని పూర్వీకులు పురాణాలలో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు ఈ సందర్భం గా కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి వారి అమ్మమ్మ ను గుర్తు చేసుకున్నారు నేను అమ్మమ్మ ఇంట్లో ఇంటర్మీడియట్ వరకు చదివిన విషయం తెలిపి,అమ్మమ్మ నాకు ఆయుర్వేదం గురించి తెలిపి నేను ఆయుర్వేదం తీసుకునేలా చేసిన అమ్మమ్మ ను గుర్తు చేసుకున్నారు భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ గురించి మాట్లాడుతూ కరోనా పట్టి పీడిస్తున్న సమయంలో 150 దేశాలకి ఆయుర్వేదం గురించి తెలుసుకునేలా చేసి వారికి పంపించిన విషయం నాకు , మీకు తెలుసు అని అన్నారు ఈ కార్య క్రమం నిర్వాహకులు డాక్టర్ సారంగా పాణి తో పాటు డాక్టర్ మనోరంజన్( పద్మశ్రీ), డాక్టర్ ఎ.సమ్మిరెడ్డి,డాక్టర్ శ్రీకాంత్ శర్మ,డాక్టర్ దినేష్,డాక్టర్ ప్రకాష్ రెడ్డి ,పాల్గొన్నారు దేశం లోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఆయుర్వేదిక్ సెంటర్స్ డాక్టర్ల తో వేదిక ప్రాంగణం నిండిపోయింది. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ నియోజక వర్గం భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.



# సమకాలీన రాజకీయాల్లో సమున్నత నేత

## దేశం కోసం పరితపించిన సీతారాం ఏచూరి

### ప్రథమ వర్ధంతి సందర్భంగా నివాళి

హైదరాబాద్,సెప్టెంబర్13:
సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి మరణించి అప్పుడే ఏడాది పూర్తయ్యింది. గతేడాది సెప్టెంబర్ 12 మరణించిన ఏచూరి జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. ఆయన పోయిన ఏడాది లోపే ఇటీవల సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి కూడా వయోభారంతో గతించారు. కానీసీతారం మాత్రం అనూహ్యంగా మరణించారు. ఇకపోతే సీతారాం ఏచూరి మరణం తెలుగువారికి తీరని లోటు. నిబద్ద రాజకీయాలకు ఆయన పెట్టింది పేరు. అహంకారం కనిపించని మృదుస్వభావిగా జాతీయ రాజకీయాల్లో రాణించారు. సిపిఎం లాంటి పార్టీకి సారథిగా రాణించడం ఆషామాషీ వ్యవహారం కాదు. సమకాలీన రాజకీయాల్లో మంచి పట్టు ఉండడంతో పాటు, పలు భాషల్లో ప్రావీణ్యం సంపాదించడం, ముక్కుసూటిగా మాట్లాడడం, అవసరమున్నంత మేరకే మాట్లాడడం ద్వారా జాతీయ రాజకీయాల్లో ఏచూరి తనదైన ముద్ర వేసారు. జీవితంలో ఆయన ఎక్కడా రాజీపడలేదు. దేశ సమస్యలపై పోరాటం విషయంలో ఆయన రాజీలేని ధోరణితోనే రాజకీయాలు సాగించారు. సంకీర్ణ రాజకీయాలలో సీపీఐ (ఎం) నిర్వహించిన పాత్ర ఎనలేనిది. దానిని ఏచూరి మరింతగా ముందుకు తీసికెళ్లారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం కోసం కాంగ్రెస్ నేత పి. చిదంబరంతో కలిసి కనీస ఉమ్మడి కార్యక్రమం ముసాయిదాను రూపొందించారు. 2004లో యూపీఏ ప్రభుత్వ ఏర్పాటు సమయంలో సంకీర్ణ కూటమి నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించారు. ప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం ఆయన అలుపెరుగని పోరాటం చేశారు. 'భిన్నత్వంలో ఏకత్వం' అనే సిద్దాంతాన్ని విశ్వసించారు. దేశంలో ఎక్కడ హింస జరిగినా దానికి వ్యతిరేకంగా గళం విప్పే వారు. పార్టీ అంతర్జాతీయ విభాగానికి ఏచూరి నేతృత్వం వహించారు. పలు సోషలిస్ట్ దేశాలలో పార్టీ మహాసభలు జరిగినప్పుడు సౌహార్ధ ప్రతినిధిగా ఆయన హాజరయ్యేవారు.ఏచూరి 2005లో పశ్చిమ బెంగాల్ నుండి రాజ్యసభకు ఎన్నికయ్యారు. అనేక కీలక అంశాలను పార్లమెంట్ దృష్టికి తెచ్చే వారు. ముఖ్యమైన విషయాలపై ప్రశ్నలు సంధించే వారు. పార్లమెంట్ సమావేశాలకు తరచూ అంతరాయం కలిగిస్తున్నారంటూ పాలక పక్షం విమర్శలు చేస్తుంటే 'సమావేశాలకు ఆటంకం కలిగిస్తున్నాయని ప్రతిపక్షాలను నిందించడం ద్వారా ప్రభుత్వం తన బాధ్యతల నుండి తప్పించుకోలేదు' అని బదులిచ్చారు. పార్లమెంటును అడ్డుకోవడం ప్రజాస్వామ్యంలో చట్టబద్ధమైన పక్రియ అని చెప్పారు. భారత్-అమెరికా అణు ఒప్పందం కోసం సంప్రదింపులు జరుగుతున్న సమయంలో దానికి తమ పార్టీ విధించిన అన్ని షరతులను ఏచూరి రాజ్యసభలో ప్రస్తావించారు. జెఎన్‌యూ విద్యార్థిగా ప్రస్థానం మొదలు పెట్టిన సీతారం ఏచూరి సిపిఎం పార్టీకి జనరల్ సెక్రటరీగా అద్వితీయమైన భూమిక పోషించారు. భారత రాజకీయాల్లో తనకంటూ ఓ పేజీని లిఖించుకున్నారు. ఆయన పాత్ర చిరస్మరణీయం. ఏచూరి తెలుగువాడు కావడం మనకు గర్వరాణం.

### జిల్లాల్లో కదులుతున్న

# బిఆర్ఎస్ పునాదులు

### ఆజ్యం పోస్తున్న కాషాయ నేతలు

హైదరాబాద్,సెప్టెంబర్13:
పలు జిల్లాల్లో గులాబీదళం టిఆర్ఎస్‌లోనూ అసంతృప్తి జ్వాలలు కనిపిస్తున్నాయి. పైకి కనిపించనంతగా నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. పార్టీ అగ్రనేతల అవినీతి కారణంగా దాని పతనం స్పష్టంగా కనిపిస్తోంది. కాళేశ్వరం, ఫార్ముల రేస్, గొర్రెల కుంభకోణం, చెరువులు, మిషన్ భగీరథ ఇలా అన్ని కేసులకు సంబంధించి చర్చ గ్రామస్థాయిలో జోరుగా సాగుతోంది. నిప్పులేనిదే పొగరాదన్న రీతిలో సాగుతోంది. దీనికితోడు ఇక్కడా బిజెపి చాపకిందనీరులా మెల్లగా ఆజ్యం పోస్తోంది. అసంతృప్త నేతలను బుజ్జగిస్తోంది. ఈ అవినీతి పార్టీలో ఉంటూ సమాధానం చెప్పుకోలేక కిందిస్థాయిలో నేతలు అపసోపాలు పడుతున్నారు. ఓ రకంగా చెప్పాలంటే బిఆర్ఎస్ పై అవినీతి బురద స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో పార్టీలో రెండోశ్రేణి నాయకత్వం కొంత ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటోంది. బిఆర్ఎస్‌లో మంత్రులు, మాజీమంత్రులు అసంతృప్తి రాగం వినిపిస్తున్న క్రమంలో జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కేసీఆర్ గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన జోగు రామన్న.. మంత్రిపదవి కోల్పోయాక పెద్దగా చురుకుగా ఉండడం లేదు. తొలిదశలో ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి నిర్మల్ ఎమ్మెల్యే ఇంద్రకరణ్‌రెడ్డికి మాత్రమే చాన్స్ దక్కింది. ఇప్పటికే ఇంద్రకరణ్, వేణుగోపాలాచారిలో బిఆర్ఎస్‌ను వీడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జరుగుతున్న పరిణామాలపై బిజెపి వర్గాలు కన్నేసినట్లు సమాచారం. పదవులు లేకుండా,ప్రాధాన్యం లేకుండా ఉన్న నేతలపై బిజెపి నేతలు దృష్టి సారించారని సమాచారం. పలు జిల్లాల్లో బిసిలకు టిక్కెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వంలో ఉన్నా లేకున్నా పదవులు దక్కక పోవడంపై పలువురు నేతలు అసంతృప్తితో ఉన్నట్టుగా వార్తలు వెలువడ్డాయి. గులాబీ కోటలో ముళ్లు గుచ్చుకుంటున్నాయి. కొందరు మెల్లగా స్వరం పెంచుతున్నారు. బిజెపి గాలం వేస్తోందన్న భయాలు ఉన్నాయి. నివురుగప్పిన నిప్పులా ఉన్న అసమ్మతి జ్వాలలు ఎప్పుడైనా దహించే ప్రమాదం లేకపోలేదు. రాజకీయాల్లో ఎల్లకాలం ఒకేలా ఉంటారని అనుకోవడానికి లేదని అంటున్నారు. మొత్తంగా ఈ పరిస్థితిని బిజెపి జాగ్రత్తగా గమనిస్తోంది.ఈ నేపథ్యంలోనే పలువురు బిఆర్ఎస్ సీనియర్ నేతలు పార్టీని వీడతారని సోషల్ మీడియాలో ప్రచారం సాగుతుంది. దీంతో కొందరు నేతలు మీడియాకు ముందుకు వచ్చి వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. అలాగే మాజీ మంత్రి రాజయ్య కూడా కడియం శ్రీహరి లక్ష్యంగా తన అసంతృప్తిని వెళ్ల గక్కుతున్నారు. ఇప్పటికే బాహాటంగా విమర్శలు చేశారు. మొత్తంగా గులాబీకోటలో ఏదో జరుగుతుందన్న ప్రచారం మాత్రం ఊపందుకుంది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పనిచేయడంతో పాటు పార్టీకి నమ్మిన బంటుగా ఉన్న పలువురు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నది నిజం.పార్టీ కోసం ఎంతచేసినా పక్కన పెడుతున్నారని ఆయన అనుచరులు వాపోతున్నారు. మొత్తంగా ఇప్పుడు అసంతృప్త నేతల వ్యవహారం జిల్లాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేమని అంటున్నారు. బిజెపి నేతలు మాత్రం కాచుకుని కూర్చున్నారు. ఇకపోతే అవినీతి కేసుల్లో కెటిఆర్, హరీష్ రావులు అరెస్ట్ అయితే పరిస్థితి మరింత తారుమారు కావచ్చు.

# సాగు విస్తీర్ణంపై దెబ్బకొట్టిన వానలు

### యూరియా కష్టాలతో రైతుల కుదేలు

నిజామాబాద్,సెప్టెంబరు13:
జిల్లాలో ఈ వానకాలంలో అత్యధికంగా వరిసాగు చేశారని అధికారులు తెలిపారు. నిజాంసాగర్, శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులు ముందే నిండడంతో ఆయకట్టులో పంటల విస్తీర్ణం భారీగా పెరిగింది. అయతే ఇటీవలి వర్షాలు రైతుల ఆశలపై నీళ్లు జల్లాయి. అనేక ప్రాంతాల్ల వరినీట మునిగింది. దీనికితోడు యూరియా కొరత కూడా రైతులను వేధిస్తోంది. జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలు నిండడంతో పంటల సాగు భారీగా పెరిగింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా భారీగా ఈ పంటల విస్తీర్ణం పెరిగింది. ఆరుతడి పంటలకన్నా వరిసాగునే ఎక్కువమంది రైతులు చేశారు. జిల్లాలో పంటల విస్తీర్ణం పెరిగినట్లు ఈ క్రాప్ బుకింగ్ ద్వారా వ్యవసాయ అధికారుల సర్వే ద్వారా ప్రభుత్వానికి నివేదించారు. జిల్లాలో పంటల విస్తీర్ణం భారీగా పెరిగిన రుణాల పంపిణీ మాత్రం అనుకున్నవిధంగా జరగలేదు. ఇప్పటి వరకు 50శాతంలోపే రుణపంపిణీ చేశారు. జిల్లాలో భారీ వర్షాలు పడి పంటల విస్తీర్ణం పెరిగినప్పటికీ రుణ పంపిణీ మాత్రం లక్ష్యాలకు అనుగుణంగా జరగడంలేదు. మే నుంచి సెప్టెంబరు వరకు వానకాలం పంటల రుణాలు ఇవ్వాల్సి ఉన్న ఆగస్టు చివరి నాటికి 50శాతం రుణాలను కూడా పంపిణీ చేయలేదు. జూన్ నుంచి సెప్టెంబరులోపు వందశాతం పంట రుణాలను రైతులకు అందించాలని బ్యాంకుల వారీగా లక్ష్యాలను నిర్ణయించారు. దీనికితోడు ఇటీవల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వేసిన పంటలు నీట మునిగాయి. ఇప్పటి వరకు ఎన్నిమార్లు సమీక్షించినా వానకాలం పంట రుణాలు మాత్రంలక్ష్యం చేరలేదని అంటున్నారు లక్ష్యంలో 50శాతం మేరకు పంపిణీ చేశారు. ఈ నెలాఖరులో వానకాలం పంట రుణాల పంపిణీ కాలం ముగుస్తోంది. ఇంకా మూడు వారాలే గడువు ఉన్న ఇప్పటి వరకు మాత్రం ఏ బ్యాంకు కూడా లక్ష్యాలను చేరుకోలేదు. సెప్టెంబరు నెలంతా రుణాల పంపిణీ చేసిన 70శాతంలోపే పంట రుణాలు రైతులకు అందే అవకాశం ఉంది. బ్యాంకుల ద్వారా రుణాలు అందకపోవడం వల్ల రైతులు ఇతర మార్గాల్లో పంట రుణాలను తెచ్చుకుని పెట్టుబడి పెడుతున్నారు. ఇకపోతే ఆరుతడి పంటలపై ప్రభుత్వం ఎంతగా ప్రచారం చేస్తున్నా.. రైతులు వరికే మొగ్గు చూపుతున్నారు. వాణిజ్య పంటలు, సేంద్రియ పంటలకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీనికితోడు కోతుల భయంతో ఎక్కువమంది వరినే వేస్తున్నారు.జిల్లాలో అత్యధికంగా ఈ వానకాలంలో వరిసాగువైపు రైతులు మొగ్గుచూపారు. బోధన్ డివిజన్ పరిధిలో జూన్, జూలై నెలలో వరినాట్లు పూర్తిచేశారు. నిజామాబాద్, ఆర్మూర్ డివిజన్ పరిధిలో ఆగస్టు నెలలో ఎక్కువగా ఈ పంటను వేశారు. ఆరుతడి పంటలు ముఖ్యంగా మొక్కజొన్న, సోయా ఎక్కువగా సాగుచేశారు. వర్షాలు ఎక్కువగా ఉండడం వల్ల ఎక్కువ మొత్తంలో ఇతర పంటలను సాగుచేయలేదు. వర్షాలు ఉండడం వల్ల ఈ వానకాలంలో వరిసాగు ఎక్కువగా జరిగినట్లు ఏఈవోలు నిర్వహించిన క్రాప్ బుకింగ్ సర్వేలో బయటపడింది. ఈ వానకాలంలో పసుపు సాగు కూడా 22వేల ఎకరాల్లో చేశారని అంటున్నారు. .జిల్లాలో ఈ వానాకాలంలో సాగు బాగా పెరిగిందని జిల్లా వ్యవసాయ అధికారులు తెలిపారు. రైతులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను శాఖ తరపున చేశామన్నారు. శ్రీరామ్‌సాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులు నిండడం వల్ల భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. భారీ వర్షాలతో అన్ని చెరువులు జూలై నెలలోనే నిండడంతో సెప్టెంబరు మొదటి వారం వరకు ఆరుతడి పంటలతో పాటు వరిసాగును ఎక్కువమంది రైతులు చేశారు. ఆరుతడి పంటలకు అవకాశం లేకపోవడంతో రైతులు వరిసాగువైపే మొగ్గుచూపారు. ఈ సంవత్సరం ఎక్కువ మొత్తంలో వరిసాగు కావడం వల్ల జిల్లా యంత్రాంగా నికి సవాల్‌గానే మారనుంది. ఈ సంవత్సరం సాగు విస్తీర్ణం పెరగడం వల్ల ధాన్యం కొనుగోలు భారీ మొత్తంలో ఏర్పాటు చేస్తే తప్ప కొనే పరిస్థితి లేదు.

# విశాఖవాసుల కొంగుబంగారం

### కనకమహాలక్ష్మి అమ్మవారు

విశాఖపట్టణం,సెప్టెంబర్13:
శరన్నవరాత్రుల్లో విశాఖ శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపడతారు. విశాఖవాసుల కొంగుబంగారం శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారు. ఉత్తరాంధ్ర వాసులకే గాక సకల తెలుగు జనావళికి సత్యం గల తల్లిగా, కల్పవల్లిగా కోరిన వరాలిచ్చే అమృతమూర్తిగా భాసిల్లుతోంది. బంగారం కొన్నా వెండి కొన్నా తమ ఇంట వివాహ వేడుకలు జరుగుతున్నా బిడ్డ పుట్టినా విశాఖ ప్రాంతవాసులు ఆ విశేషాన్ని కనకమహాలక్ష్మికి నివేదించి, ఆశీస్సులు అందుకోవడం ఇక్కడి ఆచారం. ఇది గోపురం లేని గుడి. మూలవిరాట్టుకు భక్తులు స్వయంగా పూజలు నిర్వహించుకోవడం ఈ క్షేత్ర విశిష్టత. ఏ వేళలో అయినా దర్శించుకునేందుకు వీలుగా 24 గంటలూ తెరిచి ఉంచే ఆలయం ఇది. ఈ అమ్మవారిని సేవించుకున్నా, స్మరించుకున్నా సకల ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని నమ్మకం. కనకమహాలక్ష్మీ అమ్మవారు ఈ ప్రాంతాన్ని పాలించిన విశాఖ రాజుల ఇలవేల్పు. ఆమె నెలకొన్న ఈ ప్రాంతంలో ఒకప్పుడు విశాఖ రాజుల కోటబురుజు ఉండేదని, అందుచే తల్లి ఉన్న ఈ ప్రాంతాన్ని బురుజుపేటగా పిలుస్తున్నారు. కనకమహాలక్ష్మి ఆలయం మొదటి నుంచీ ప్రస్తుతం ఉన్న ప్రాంతంలోనే ఉంది. 1912 కాలంలో వీధి వెడల్పు చేస్తున్నప్పుడు అమ్మ వారి విగ్రహం కదపకుండా వీధి మధ్యలోనే ఉంచేసినా 1917లో రోడ్డు మధ్యభాగం నుంచి 30 అడుగుల దూరంలో ఒక మూలగా జరిపారు. అప్పుడే విశాఖలో ప్లేగు వ్యాధి ప్రబలింది. దీంతో ప్రజలు భయభ్రాంతులై అమ్మవారి విగ్రహాన్ని కదిలించడం వల్లే ఈ విపత్తు జరిగిందని భావించి అమ్మవారి విగ్రహాన్ని యథాస్థానంలోకి చేర్చారు. దాంతో ప్లేగు వ్యాధి తగ్గి జనం స్వస్థత చెంది ఇదంతా అమ్మవారి మహాత్మ్యం వల్ల జరిగిందన్న ప్రగాఢ విశ్వాసం ప్రబలింది. అప్పటి నుంచి ప్రజలు అమ్మవారికి ఇతోధికంగా పూజలు చేయడం ప్రారంభించారు. కాగా, ఈ గుడికి పైకప్పు కట్టడానికి జరిగిన ప్రయత్నాలు సఫలం కాలేదు. అంటే అమ్మకు అది ఇష్టం లేదని గ్రహించి ఆ తర్వాత ఆ ప్రయత్నాలను విరమించారు. అమ్మ సకల జనులకు అందు బాటులో ఉంటుంది. కనుకనే పూజలు చేసుకోవడానికి వచ్చిన భక్తులు ఎవరికి వారే అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేసి, కొబ్బరికాయలు కొట్టి నివేదించి సేవించుకొనే సంప్రదాయం ఉంది. ముఖ్యంగా స్త్రీలు అమ్మను ఐదవతనాన్ని ఇనుమడింప జేసే దేవతామూర్తిగా భావిస్తారు. అమ్మవారికి గురువారం ప్రీతికరమైన రోజు. ఆ రోజున తెల్లవారినది మొదలు రాత్రి వరకు అమ్మను దర్శించి పసుపు, కుంకుమలతో పూజించి నారికేళం సమర్పించడానికి వచ్చే భక్తులకు అంతుండదు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన

ఏఎం న్యూస్ / యాదగిరిగుట్ట :




డాక్టర్. రవీందర్ నాయక్, డైరెక్టర్ అఫ్ పబ్లిక్ హేల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గారు, డాక్టర్. మనోహర్, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖధికారితో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, యాద గిరిగుట్ట సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్, సిబ్బందికి phc పెర్ఫార్మన్స్ పై, మరియు స్వస్త్ నారి స్వసస్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం పై రివ్యూ నిర్వహిం చడం జరి గింది.జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్షించి సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవలపై సంతృప్తి వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యధికారి డాక్టర్ పావని, డాక్టర్ హరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

# నేను రేసులో ఉన్నా : అంజన్ కుమార్ యాదవ్

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్ ఎం పి గా రెండు సార్లు గెలిచానాను అని జూబ్లిహిల్స్ అభివృద్ధి కి కృషి చేశాను అని గుర్తు చేశారు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ ఎం పి అంజన్ కుమార్ యాదవ్. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో కష్టకాలం ఉన్నప్పుడు అండగా ఉన్నానని గుర్తు చేశారు పి, జై,ఆర్,తో జూబ్లిహిల్స్ నియోజక వర్గం లో అన్ని డివిజన్ లు తిరిగి పలు కాలని ల సమస్యలు పరిష్కరించేలా కృషి చేశాను అని అన్నారు 2004, 2009 లో నేను గెలిచిన విషయం గుర్తు చేశారు అంజన్ కుమార్ యాదవ్. 170167 ఓట్ల మెజారిటీ కాంగ్రెస్ పార్టీ తరపున సాధించిన విషయం గుర్తు చేశారు అన్ని డివిజన్ ల సీనియర్ నాయకులు కార్యకర్తలు మహిళా నాయకురాళ్లు అందరూ తో నాకు సంబంధాలు ఉన్నాయని అన్నారు హైదరాబాద్ టైగర్ గా పేరు తెచ్చుకున్న నా గురించి తెలంగాణ రాష్ట్రం మనకు కానుకగా ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ కి నేను ఏంటో తెలుసు అని రాబోయే రోజుల్లో జరిగే జూబ్లిహిల్స్ ఉప ఎన్నిక లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నేను రేసులో ఉన్నానని,నాకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం టికెట్ ఇస్తే భారీ మెజారిటీ తో విజయం సాధించి సోనియమ్మకు కానుకగా ఇస్తాను అని అన్నారు.

# ప్రైవేట్ దవాఖానాల వద్ద క్యూ కడుతున్న రోగులు

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :




తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నగరం లోని అన్ని( సిటీ లో) ప్రాంతాలలో ప్రైవేట్ దవాఖానల వద్ద రోగులు క్యూ కడుతున్నారు విషయానికి వస్తే మొన్నటి వరకు,ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మురుగు నీరు తో పాడుతున్న కాలనీలు, మిగతా ప్రాంతాలు లో చిన్న పాటి జబ్బు తో మొదలైన (నలతగా ఉండటం, దగ్గు, జలుబు, శరీరం వేడి అవటం, నొప్పులు, మొదలగు) వ్యాధులు వలన నగరం లో నీ అన్ని కాలనీల ప్రజలు ప్రైవేట్ దవాఖానా, గవర్నమెంట్ ఆసుపత్రుల లో చికిత్స కోసం క్యూ కడుతున్నారు ఈ విషయమై సీనియర్ డాక్టర్ లను మా ఎ ఎం న్యూస్ జూబ్లిహిల్స్ నియోజక వర్గ రిపోర్టర్ సంప్రదిస్తే వారు ప్రజలకు కొన్ని సూచనలు ఇచ్చారు పిల్లలు,పెద్దలు ఉదయం ,సాయంత్రం( వారి వీలుని బట్టి)వేడినీరు తాగాలని, బయట చిరు ఆహారపు అలవాట్లకు దూరం ఉండాలని, ఎప్పటికప్పుడు వారి పరిసరాలను శుభ్రం గా ఉంచుకోవాలని, పిల్లలకు జ్వరం లాంటివి వస్తే స్థానిక వైద్యులకు( మీ దగ్గరలో ఉన్న ప్రైవేట్,ప్రభుత్వ డాక్టర్) చూపించి చికిత్స తీసుకోవాలని అన్నారు వర్షం పడేటప్పుడు అర్జంట్ పని ఉంటేనే బయటకు వెళ్లాలి అని అన్నారు ఇంటి ఆహారం( వేడిగా చేసుకున్న) తీసుకోవాలని అన్నారు.

# ఆగ్రహం వ్యక్తం చేసిన మాగంటి వజ్రనాథ్

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



బి ఆర్ యస్ పార్టీ కి సుమారు 15 ఏళ్ల నుంచి నిస్వార్థంగా సేవ చేస్తున్న సీనియర్ నాయకులును, కార్యకర్తలను విస్మరిస్తున్నారని మాగంటి వజ్రనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.. శని వారం యూసుఫ్ గూడ డివిజన్ సీనియర్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు ..ఈ సమావేశం లో ముఖ్యంగా 35 బూత్ లకు సంబందించిన బూత్ ఇంఛార్జీలు హాజరయ్యారు..ఎంతో కాలంగా బి ఆర్ యస్ పార్టీ కి సేవ చేసిన మమ్మల్ని కాదని వేరే వారికి బూత్ లు కేటాయించడం ఆవేదన కలిగించిందని అందుకే ఈ మా ఆవేదన తెలియజేయడానికి ఈ అత్యవసర సమావేశం శ్రీ మాగంటి వజ్రనాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశాం అని అన్నారు దివంగత నేత మాగంటి గోపీనాథ్ ఎప్పుడు ఇలాంటి పనులు చేయలేదని ప్రతి కార్యకర్తకు న్యాయం చేసారని తెలిపారు..ఈ సందర్భంగా మాగంటి వజ్రనాథ్ మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటానని, ఈ విషయాన్ని అధిష్టానం వద్దకు తీసు కుని వెళ్తానని, ఈ లాంటి కార్యక్రమలు పార్టీ కి మంచిది కాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఇందిరానగర్ ఫేజ్,2 వాసులతో మాగంటి దిశిర

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



ఎన్నికలు వస్తూ ఉంటాయి పోతూ ఉంటాయి... ప్రజల మనసులో ఎల్ల కాలం గుర్తుండడమే కాకుండా వారి బాగోవులను అనునిత్యం తెలుసుకోవడమే తమ ముందున్న ప్రధాన బాధ్యతని జూబ్లీహిల్స్ శాసనసభ్యులు, హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు స్వర్గీయ మాగంటి గోపీనాథ్ కుమార్తె మాగంటి దిశిర అన్నారు. శనివారం జూబ్లిహిల్స్ నియోజక వర్గం రహమత్ నగర్ డివిజన్ ఇందిరానగర్ ఫేజ్-2 కాలనీవాసులను మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం కాలనీ ప్రజల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాస్పర్ హై స్కూల్ విద్యార్థులతో మమేకమై వారిలో కలిసిపోయారు. తన చిన్ననాటి విద్యార్థి దశ మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు.